



స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ తదితరులు



స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు

సంబరంగా స్నాతకోత్సవం

◆ ఎస్‌కెయులో పండుగ వాతావరణం ◆ ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్
◆ పరిశోధన, విస్తరణలో ఎస్కేయు భేష్ ◆ కితాబునిచ్చిన గవర్నర్



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(ఎస్కేయు) 21వ స్నాతకోత్సవం సోమవారం నాడు సంబరంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఛాన్సలర్ హోదాలో ఈ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేయగా 9150 మందికి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఎస్కేయు వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సమస్యలపైనే నాకుండా దివ్యాంగుల క్రికెట్ అభివృద్ధిలో విశేషంగా కృషి చేసిన బెంగళూరుకు చెందిన సమర్థనం ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ జికె.మహంతేష్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి గరవ్నర్ ప్రసంగించారు. విద్యార్థులకు దిశా నిర్దేశం చేయడంతోపాటు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం గురించి తన ప్రసంగంలో పేర్కొనడం గమనార్హం. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధిని ఈ సందర్భంగా గవర్నర్ కొనియాడారు. రూసా నిధులను సద్వినియోగం చేసుకుని మౌలిక సదుపాయల కల్పన చేయడం బాగుందన్నారు. పరిశోధన, విస్తరణ పనులు బాగా జరుగుతున్నట్టు తెలిపారు. అదే సందర్భంలో స్టార్టప్ కింద చేపట్టిన అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం రాబోయే రోజుల్లో ఒక మోడల్ కేంద్రంగానూ మారబోతోందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇస్రో తోడ్పాటుతో జరుగుతున్న కార్యక్రమాలు బాగున్నాయన్నారు. బొటానికల్ గార్డెన్, మయాకవి ప్లాంటేషన్ బాగున్నట్టు కితాబునిచ్చారు. అదే సందర్భంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని చెప్పారు. ఇది మనిషికి శక్తినే కాకుండా ఆలోచనలకు ఆకృతినిస్తుందని పేర్కొన్నారు. డిగ్రి పూర్తి చేయడమంటే అభ్యాసన ప్రయాణాన్ని పూర్తి చేయడం కాదని, జ్ఞానం కోసం జీవితకాల అన్వేషణకు నాంది అని విద్యార్థులకు ఉద్బోదించారు. గొప్ప గొప్ప కలలు కనడం, వాటి సాకారానికి కష్టపడి కృషి చేయాలని సూచించారు. ఈ మార్గంలో కొన్ని వైఫల్యాలు ఎదురైనా అధైర్య పడకుండా ముందుకు వెళ్లాలని తెలిపారు. వైఫల్యాలే విజయానికి సోపానాలని పేర్కొన్నారు. ఏపీ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ఎస్కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, సెంట్రల్ యూనివర్సిటీ విసి ఘోరీ, కలెక్టర్ యం.గౌతమి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, జిల్లా పరిషత్ సీఈవో భాస్కర్ రెడ్డి, ఎస్‌కెయు రిజిస్ట్రార్ లక్ష్మయ్య, డీన్స్ నాగభూషణం రాజు, జివి.రమణ, శివ కుమారితో పాటు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పట్టభద్రులు పాల్గొన్నారు.

39 మందికి బంగారు పతకాలు

ఎస్కేయూ పరిధిలో 2022 సంవత్సరంలో డిగ్రీలో పూర్తి చేసుకున్న 9,150 మందికి పట్టాలను అందజేశారు. పీజీ, ఎంఫిల్, పిహెచ్‌డి పూర్తి చేసిన 1,143 మందికి పట్టాలను అందజేశారు. పీజీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 57 మంది విద్యార్థులకు పథకాలు అందజేయగా, అందులో 39 బంగారు పతకాలు, 12 మెమోరియల్ ప్రైజ్ లు, ఇద్దరికి నగదు పురస్కారాలు, నాలుగు యూనివర్సిటీ ప్రైజ్‌లు అందజేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

శ్రీ కష్ణదేవరాయల యూనివర్సిటీలో వివిధ అభివద్ధి పనులను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రారంభించారు. ముందుగా యూనివర్సిటీ ప్రాంగణంలో శ్రీకష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభించారు. తదనంతరం యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. ఆ తరువాత మెన్స్ బాలుర హాస్టల్‌ను ప్రారంభించారు.



కెస్‌కెయులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న గవర్నర్

మహంతేష్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మహంతేష్

క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా అధ్యక్షుడు, స్పిరిట్ స్పోర్ట్స్ ఇండియా అవార్డు, దివ్యజ్ఞాన ఎంపవర్మెంట్ అవార్డు గ్రహీత, సమర్థనం సంస్థ వ్యవస్థాపకుడు మహంతేష్.జికెకు వర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను రాష్ట్ర గవర్నర్ అందజేశారు. ఈ సందర్భంగా మహంతేష్ సేవలను గవర్నర్ కొనియాడారు.

మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చింది : మహంతేష్,

ఎస్‌కెయు ఇచ్చిన డాక్టరేట్ తనకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చినట్టు అయ్యిందని డాక్టరేట్ స్వీకరించిన డాక్టర్ మహంతేష్ తెలిపారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం హర్షనీయమన్నారు. దివ్యాంగుల క్రికెట్ అభివృద్ధి తమ సంస్థ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. విద్య అన్నది వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా ఇతరులను అభివృద్ధి పథంలో నడిపించే సాధనమని చెప్పారు. తన అభివృద్ధి, తోడ్పాటులో అనేక మంది సహకారం ఉందని తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని చెప్పారు.

గవర్నర్‌కు ఘనంగా వీడ్కోలు



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

చిలమత్తూరు : ఎస్‌కెయు స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన గవర్నర్ కార్యక్రమాలను ముగించుకుని తిరుగుప్రయాణం అయ్యారు. అనంతపురం నుంచి రోడ్డు మార్గం ద్వారా సోమవారం సాయంత్రం శ్రీ సత్యసాయి జిల్లా కోడికొండ చెక్ పోస్ట్ సమీపంలోని రక్ష అకాడమీ వద్దకు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టర్ పి.అరుణ్ బాబు, సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ మాధవరెడ్డి, పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్ తదితరులు గవర్నర్‌ను కలిసి వీడ్కోలు పలికారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించి, రోడ్డు మార్గం ద్వారా బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

విజయనగర్ లా కళాశాలలో గవర్నర్..



విజయనగర లా కళాశాలలో మాట్లాడుతున్న గవర్నర్

అనంతపురంలోని హౌసింగ్‌బోర్డులో ఉన్న శ్రీ విజయనగర్ కాలేజ్ ఆఫ్ లా పీజీ స్టడీస్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటించారు. కళాశాలలో లైబ్రరీ, మూట్ కోర్ట్ ఆదనవు భవన నిర్మాణాలకు గవర్నర్ శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థులతో గవర్నర్ కాసేపు ముచ్చటించారు. ఆడిటోరియం ఎదుట న్యాయమూర్తిగా జస్టిస్ అబ్దుల్ నజీర్ వెలువరించిన తీర్పుల వివరాలున్న ఫ్లెక్సీ బోర్డును తిలకించారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విజయనగర్ కాలేజ్ ఆఫ్ లా ఫౌండర్ ఛైర్మన్ రామిరెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, అడ్వకేట్ హరికృష్ణ, ప్రిన్సిపల్ డా॥రాఘవేంద్ర చారి పాల్గొన్నారు.

త్రోబాల్ రాష్ట్ర జట్టుకు 'పురం' విద్యార్థిని ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన రితిక

ప్రజాశక్తి-హిందూపురం

త్రో బాల్ రాష్ట్ర జట్టుకు పట్టణంలోని వాసవి విన్నర్స్ పాఠశాలకు చెందిన రితిక ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం తెలిపారు. ఎంపికైన విద్యార్థి రితికను సోమవారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి బైసాని రాంప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల పట్టణంలోని ఎంజిఎం మైదానంలో త్రోబాల్ రాష్ట్ర జట్టు ఎంపికకు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని రితిక మంచి ప్రతిభను కనబర్చి జట్టుకు ఎంపిక అయిందన్నారు. ఈ నెల 23 నుంచి గుంటురులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కార్యదర్శి దాసా గంగాధర్, నంద కిశోర్, చంద్ర మోహన్, సురేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఉద్యోగానికి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మురళీ మోహన్ సోమవారం తెలిపారు. బిఎస్‌సి నర్సింగ్‌లో 50శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు అన్నారు. అసక్తి గల వారు ఈ నెల 19న ఒర్జినల్ సర్టిఫికెట్లతో పాటు 3 సెట్ల జెరాక్సు కాపీలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

ఇద్దరు 104 సిబ్బందిపై వేటు

ప్రజాశక్తి-చిలమత్తూరు

పిహెచ్‌సి 104 వాహనంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులపై వేటు పడినట్లు మండల వైద్యాధికారి రామక్రిష్ణ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మండలంలోని మధురేపల్లి గ్రామంలో వైద్యాధికారి-2తో పాటుగా గోలీల ఆటఆడుతూ విధులు మరిచారన్న ఆరోపణలు వచ్చాయి. దానిని బలపరుస్తూ వీడియో వైరల్ కావడంతో ఇద్దరి ఉద్యోగులపై వేటు వేశారు. అయితే వీడియో గోలీల ఆట ఆడుతున్న వైద్యాధికారి-2పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనర్హాం. ఈ విషయంపై మండల వైద్యాధికారి రామక్రిష్ణను వివరణ కోరగా డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోందని చెప్పారు.

స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ రజక సంఘం నాయకులు స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులకు సోమవారం నాడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలో రజక కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలన్నారు. భవన నిర్మాణానికి నిధులూ విడుదల చేయాలన్నారు. దోబీఘాట్, లాండ్రీ షాపులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర డైరెక్టర్ రామచంద్ర, గణేష్, గంగాద్రి, శ్రీనివాసులు, కేశవ, వెంకటేష్ పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఎస్‌కె యూనివర్శిటీలో డాక్టరేట్ పొందిన సోషల్ యాక్టివిస్ట్, వర్డ్ బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సమర్థనం ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ మహంతేష్.జికెను చిలమత్తూరు మండలం కేంద్రంలో సమర్థనం ట్రస్ట్ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ దేశ రాజధాని మొదలు దేశ వ్యాప్తంగా 13 ఎల్‌ఆర్సీలు దివ్యాంగులకు శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఆదర్శవంతగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సమర్థనం ట్రస్ట్ సిబ్బంది సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, ఎల్‌ఆర్‌సి స్టాప్ ఎర్రిస్వామి, మహేష్, శంకర్, నరసింహులు, కవిత పాల్గొన్నారు.



డాక్టరేట్ గ్రహీతను సన్మానిస్తున్న సమర్థనం ట్రస్టు సిబ్బంది

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ అరుణ్ బాబు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్‌తో పాటు అధికారులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజలు సంతృప్తి పొందే విధంగా స్పందన, జగనన్నకు చెబుదాం అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్‌ఒ కొండయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఆర్డీవో భాగ్యరేఖ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అధికారులు 260 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో డివిజన్, మండల స్థాయి అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. ఇందులో ఎలాంటి అలసత్వాన్ని అధికారులు ప్రదర్శించరాదన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో సమీక్ష సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈనెల 14న పుట్టపర్తి నియోజకవర్గం సమావేశం పూర్తి చేశామన్నారు. ఈనెల 21న మడకశిర నియోజకవర్గంకు సంబంధించి మడకశిరలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామిలు పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలో మండలాల వారీగా సమీక్ష జరుగుతుందని, సంబంధిత అధికారులు అందరూ ఇందులో పాల్గొనాలని ఆదేశించారు. నాడు-నేడు, గృహ నిర్మాణం, మైనింగ్, గతంలో వర్షాల వల్ల నష్టపోయిన పంటల వివరాలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు ఈనెల 19న నియోజకవర్గం సమస్యల వివరాలను సిపిఓకు అందజేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతిరోజు లక్ష మంది ఉపాధి కూలీలకు పనులు కల్పించాలనే లక్ష్యం ఉండగా 65 వేలమందికి పనులు కల్పిస్తున్నారని, కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పెనుకొండ, రామగిరి, రొద్దం, చిలమత్తూరు మండలాలలో 20 నుంచి 25 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకున్నారని, ఇక్కడ ఉపాధి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్‌కుమార్, గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళిరెడ్డి, పిఆర్ఎస్‌ఇ గోపాల్ రెడ్డి, డిఎంహెచ్‌ఒ కష్ణారెడ్డి అధికారులు పాల్గొన్నారు.

'గురుకులం' నుంచి వెళ్లిపోయిన విద్యార్థి

◆ 20 గంటలైనా గుర్తించని అధికారులు ◆ పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు..

ప్రజాశక్తి-లేపాక్షి



లేపాక్షి మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల(ఇన్‌సెట్‌లో విద్యార్థి)

లేపాక్షి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా గురుకుల పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి ఆదివారం సాయంత్రం సిబ్బంది ఎవరికీ చెప్పకుండా పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం అయినా ఈ విద్యార్థి పాఠశాలలో లేడన్న విషయాన్ని సంబంధిత గురుకులం పాఠశాల అధికారులు, సిబ్బంది గుర్తించలేదు. ఈ ఘటన గురుకులంలో చదివే పాఠశాల విద్యార్థుల సంరక్షణ పట్ల ఎలాంటి నిర్లక్ష్యవైఖరి అవలంభిస్తున్నారన్నది అద్దం పడుతోంది. ముదిగుబ్బ మండలం నాగులబావి గ్రామానికి చెందిన షామీర్ కుమారుడు షాజహాన్ లేపాక్షి మహాత్మా జ్యోతిబా గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థి ఆదివారం సాయంత్రం పాఠశాల నుంచి బయటకు వచ్చాడు. అక్కడి నుంచి కాలినడకన అతని గ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో చీకటి పడటంతో దిక్కుతోచక ఎక్కడికీ పోలేని పరిస్థితిలో చిలమత్తూరు మండలం అటవీ ప్రాంతంలోని కనుమ లక్ష్మీనరసింహా స్వామి ఆలయం వద్ద నిద్రించాడు. ఎక్కడికి పోవాలో తెలియక సోమవారం ఉదయం బాలుడు ఏడుస్తూ అక్కడే కూర్చొన్నాడు. అటుగా వెళ్లిన ఓ ప్రయివేటు పాఠశాల బస్సు డ్రైవర్ బాలున్ని గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు విద్యార్థినితో మాట్లాడగా తన చిరునామా చెప్పాడు. వెంటనే పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించి బాలున్ని వారికి అప్పగించారు. కాగా దాదాపు 20 గంటల పాటు బాలుడు కనబడకున్నా లేపాక్షి గురుకులం ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. తల్లిదండ్రులు వారి పిల్లలను చూడడానికి వెళ్తే లోపలికి కూడా అనుమతించని గురుకులం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఇలా ఓ పిల్లాడు పాఠశాల నుంచి బయటకు వెళ్లినా గుర్తించకుండా ఏమి చేస్తున్నారంటూ పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరడానికి ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

కూడలితో పాటు రైల్వే రోడ్డును అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి-హిందూపురం




కమిషనర్‌తో కలిసి రహమత్‌పురం సర్కిల్‌ను పరిశీలన చేస్తున్న దీపిక

పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్‌ను అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు రైల్వే రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామని వైసిపి సమన్వయ కర్త దీపిక అన్నారు. సోమవారం మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ ప్రమోద్‌కుమార్‌తో కలిసి సర్కిల్‌తో పాటు రోడ్డును పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రోడ్డు పనులు ప్రారంభం కాక పోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణంలో బైపాస్ రోడ్డులో ఉన్నా రహమత్‌పురం సర్కిల్‌ను అన్ని విదాలా తీర్చిదిద్దడంతో పాటు పైలాన్ పని చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వే రోడ్డు విషయంలో అధికారులు, మంత్రులతో చర్చించి, అవసరమైప నిధులను మంజూరు చేయించి, త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే మురుగు కాలువల పనులను, విద్యుత్ స్తంబాలను మార్చే పనులను ప్రారంభించామని, త్వరలో రోడ్డు పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీయర్లు, కౌన్సిలర్లు మారుతిరెడ్డి, శివ, రామచంద్ర, వైసిపి రాష్ట్ర కార్యదర్శి హనుమంత రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంపిపి ఆరోపణలకు
ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి : టిడిపి

ప్రజాశక్తి-రొళ్ల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మడకశిర శాసనసభ్యుడు తిప్పేస్వామిపై ఆయన పార్టీకే చెందిన రొళ్ల మహిళా ఎంపిపి కవిత చేసిన ఆరోపణలకు ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని మండల టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలకు హద్దులు లేకుండా రెచ్చిపోతున్నారని, ప్రతి అంశంలోనూ కమిషన్ లేనిదే ఏ పనీ చేయరంటూ వైసీపీకే చెందిన ఎంపిపి మీడియా ముందు చెప్పారన్నారు. ఎమ్మెల్యే వల్ల ఆమె కుటుంబానికీ ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఒక మహిళా ప్రజాప్రతినిధి ఇంతలా ఆరోపణలు చేశారంటే నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. నిత్యం ప్రతిపక్షాలపై గొంతుచించుకునే ఎమ్మెల్యే అనుచరులు వైసీపీ ఎంపీపీ చేసిన ఆరోపణలకు ఏమి సమాధానం ఇస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసిపి నేతలు వాస్తవాలను తెలుసుకుని ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు యన్.దాసిరెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బియస్.గురుమూర్తి, జికె.ఈరన్న, భరత్, రామకృష్ణ, బాలకష్ణ, నాగరాజు, మాజీ ఎంపిపి కిష్టప్ప, సిద్ధగంగప్ప, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

తక్కువ ధరకు కందిపప్పు, బియ్యం పంపిణీ

మడకశిర రూరల్ : పౌరసరఫరాల శాఖ, కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు ఇచ్చే కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో ప్రారంభించారు. బియ్యం కిలో రూ.44, కందిపప్పు కిలో రూ.134కు ప్రజలకు అందిస్తున్నట్లు తహశీల్దార్ ముర్షావలి తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ హారతి, కిరాణా వర్తక సంఘం నాయకులు ఆదినారాయణ, రాజు పాల్గొన్నారు.

'ఉపాధి' అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పుట్టపర్తి అర్బన్ : ఉపాధి పథకంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని మాజీ ఎమ్మెల్యే పాముదుర్తి రవీందర్ రెడ్డి తనయుడు వైసీపీ నాయకుడు ఇంద్రజిత్ రెడ్డి, పాముదుర్తి గ్రామ సర్పంచి జ్యోతిలు వేర్వేరుగా కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్, మరొక విద్యుత్ శాఖ ఉద్యోగి కలిసి ఉపాధిలో అక్రమాలు చేస్తున్నారని చెప్పారు. కూలి పనులు చేయని వారికి బిల్లులు ఇస్తూ అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. ఈ విషయమై గతంలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఇదే గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి పూర్వకాలం నుంచి ఉన్న పిల్ల కాలువను దౌర్జన్యంగా పూడ్చివేశాడని చెప్పారు. అధికారులు వీటిపై విచారణ జరిపించాలన్నారు.

మోడీ హయాంలో చేనేత వ్యవస్థ నిర్వీర్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేసి పవర్‌లూమ్స్, కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, ఇప్పటికే జీఎస్టీ వల్ల చేనేత మగ్గాలు మూలనపడ్డాయని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు, నాయకులు వెంకటస్వామి, నాగేంద్ర, శ్రీనివాసులు, ప్రకాశ్, విశ్వనాథ్, రాములు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చేనేతపై జీఎస్టీ వేయడాన్ని మొదటి నుంచి చేనేత వర్గం వ్యతిరేకిస్తోందన్నారు. ముడి సరుకుల ధరలు పెరగడం, గిట్టుబాటు ధర లభించకపోవడంతో చాలా మంది కార్మికులు పనులు లేక వలసలు, ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కేంద్ర ప్రభుత్వం నూలుపై 5శాతం, జరీ, పట్టుపై 12శాతం, రంగులపై 18శాతం, రసాయనాలపై 18శాతం జీఎస్టీ వేసి చేనేతల నడ్డి విరిచిందన్నారు. జీఎస్టీ రద్దు చేయాలని దేశవ్యాప్తంగా ఆందోళనలు చేసినా కేంద్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. చేనేతపై జీఎస్టీని రద్దు చేయాలని లేనిపక్షంలో మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.


లేపాక్షి ఆలయంలో ట్రైనీ కలెక్టర్లు

లేపాక్షి ఆలయ సందర్శన

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి ఆలయాన్ని సోమవారం 10 మంది అసిస్టెంట్ కలెక్టర్లు(ట్రైనీ కలెక్టర్లు) సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వీరికి ముందుగా ఆలయ అర్చకులు దేవాదాయ శాఖ తరపున ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, లేపాక్షి ఎస్ఐ మునీర్అహ్మద్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ కలెక్టర్లు

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో వివిధ జిల్లాలను పరిశీలిస్తున్న 10 మంది ట్రైనీ కలెక్టర్లు సోమవారం పుట్టపర్తికి వచ్చిన సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి కలెక్టర్ జిల్లా విశిష్టత, చారిత్రక ప్రదేశాలు, సత్యసాయి, పుట్టపర్తి గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం టౌన్ : ధర్మవరం మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న 13 వాలంటీర్ల పోస్టులకు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ బండిశేషన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15-07-2023 నాటికి 18 ఏళ్లు నిండి 35 ఏళ్ల లోపు ఉన్న నిరుద్యోగ యవతీ, యువకులు అర్హులన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

గ్రీవెన్స్ డేకి అధికారుల డుమ్మా

గోరంట్ల రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గ్రీవెన్స్ డేకు అధికారులు హాజరుకాక సోమవారం కార్యాలయం వెలవెల పోయింది. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి ప్రజలు ఫిర్యాదులు అందజేయడానికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేకు వచ్చారు. అయితే తహశీల్దార్, ఎంపీడీవోతో పాటు మరో ఇద్దరు అధికారులు తప్ప మిగిలిన శాఖల అధికారులు హాజరుకాలేదు. దీంతో ప్రజా సమస్యలపై కనీస బాధ్యత లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ఫిర్యాదుదారులు వాపోయారు. ప్రజలు అధికారుల కోసం చాలాసేపు వేచి చూసి వెనుదిరిగిపోయారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు : 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఇన్‌స్పైర్ అవార్డు కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షి సూచించారు. 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం భ్రమరాంబ మాట్లాడుతూ ఈ ఉపాధ్యాయులు విద్యార్థుల క్రమశిక్షణ, విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓలు బి.కృష్ణనాయక్, శ్రీనివాసులు, ఉపాధ్యా యులు పామిడి ముంతాజ్‌అలీ, జయరాములు, చిన్నప్పయ్య, గంగాధర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల పరిధిలోని దేవరింటిపల్లి గ్రామంలో సోమవారం ఎఒ భారతి సిబ్బందితో కలిసి వేరుశనగను పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ పూత దశలో ఉన్నప్పుడు జిప్సం చల్లడం ద్వారా నూనె శాతం, బరువు పెరుగుతాయని సూచించారు. అలాగే ఆకుముడత, లద్దెపురుగు, ఆశించినప్పుడు వేయాల్సిన పురుగుమందులు, ఏమోతాదులో వాడాలి, పిచికారి చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. వారి వెంట విహెచ్ఎ భాస్కరనాయక్, రైతులు మహేంద్రరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, మల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమకు వైభవం తీసుకొస్తాం

నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

జగన్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, జిల్లాలో పట్టు పరిశ్రమకు వైభవం తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపిక పేర్కొన్నారు. అలాగే పట్టు రైతులు, రీలర్ల సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలోని పట్టు గూళ్ల మార్కెట్‌లో సోమవారం పట్టు రీలర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన దీపిక, వేణురెడ్డిలను ఘనంగా సన్మానించా రు. ఈ సందర్భంగా రీలర్లు, పట్టు రైతులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహక బకాయిలు, రేషం షెడ్లు, రోగ నిరోధక మందులు, పరికరాలు, మొక్కలకు ఇవ్వాల్సిన సబ్సిడీలు ఇప్పించాలని కోరారు. పట్టు గూళ్ళ మార్కెట్‌లో కొత్త భవనం నిర్మాణం చేపట్టేలా, జిల్లా



దీపిక వేణురెడ్డిలను సన్మానిస్తున్న పట్టు గూళ్ల రీలర్లు

పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం జిల్లాకు ప్రత్యేక కమిషనర్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన దీపిక ఆయా సమస్యలను మంత్రి పెద్దిరెడ్డి, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, కౌన్సిలర్లు మారుతీరెడ్డి, శివ, ఆసిఫ్‌వుల్లాతో పాటు నాయకులు, పట్టు రైతులు, రీలర్లు పాల్గొన్నారు.

జగన్ పాలనలో కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం

ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్య, వైద్య రంగాలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రాధాన్యత ఇస్తూ అత్యాధునిక వసతులను కల్పించి ప్రజలకు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం అందిస్తున్నారని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే పట్టణంలోని 29వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సిఎం జగన్ 33కు పైగా సంక్షేమ కార్య క్రమాలను అమలు చేశారన్నారు. డిబిటి ద్వారా రూ. 2 లక్షల కోట్లకు పైగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఇదంగా చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజిమున్నిసాసాధిక్, వైస్ ఛైర్మన్ రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల ఛైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పోలింగ్ బూత్ మేనేజర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కన్వీనర్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం

'జగనన్న సురక్ష' ప్రజలకు వరం అని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కదిరి మున్సిపాలిటీ, నూలిబండ షహమీరియా స్ట్రీట్, వలిషాబ్ రోడ్ గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో అక్రమ కట్టడాలు తొలగించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ భూకబ్జాదారులు పట్టణంలో అనేక చోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుంటున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో సిపిఎం ఆధ్వర్యంలో జెండాలు పాతి నిరుపేదలకు ఇంటిస్థలాలు పంచుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగాధర్, బాబావలి, మహబూబ్‌బాషా, తిప్పన్న, ఊతప్ప, వెంకట్రాముడు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలివ్వాలి

సోమందేపల్లిలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని పెనుకొండ సిపిఎం మండల కార్యదర్శి రమేష్, గంగాధర్ ఆధ్వర్యంలో 'స్పందన'లో సబ్ కలెక్టర్



సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

కె.కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందిం చిన సబ్ కలెక్టర్ ప్రతి అర్జీని పరిశీలించి పంచాయతీ పరిధిలో ఉన్న అర్హులందరికీ సకాలంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సోమందేపల్లి సిపిఎం మండల నాయకులు హనుమయ్య, వెంకటేష్, గంగరాజు, శ్రీకాంత్, కొండా వెంకటేష్, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణ స్వామి, బెస్త కిష్టప్ప, ఉప్పర కిష్టప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు నాగభూషణ, షబ్బీర్, మహిళా సంఘం మండల నాయకులు అలివేలమ్మ, శ్రీనివాసులు, మాధవి, మంజుల, అనిత సుబ్బరాయప్ప, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యూజర్ ఛార్జీలు వంద శాతం వసూలు చేయాలి

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం పరిధిలో ఇంటింటి చెత్త సేకరణకు సంబంధించి వసూలు చేయాల్సిన యూజర్ ఛార్జీలు వంద శాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శానిటేషన్ సెక్రటరీలను ఆదేశించారు. పట్టణంలోని కమిషనర్ కార్యాలయంలో యూజర్ ఛార్జీలు, పారిశుధ్యం మెరుగుపై శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డులో వంద శాతం యూజర్ ఛార్జీలను ఆయా సచివాలయ సెక్రటరీలు వసూలు చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమంలో అవసరమైతే మెప్మా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆర్‌పిల సహకారం తీసుకోవాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమల నియంత్రణ కోసం రోజు మార్చి రోజు వార్డుల్లో ఫాగింగ్ చేయించాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ చేపట్టి మురుగు కాలువలను శుభ్రం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

చేయించాలన్నారు. ఈ పనులను పూర్తి చేసిన అనంతరం వార్డు కౌన్సిలర్ల సంతకాలు తీసుకోవాలని సూచించారు.


రీసర్వే వేగవంతం చేయాలి

పురపాలక సంఘం వ్యాప్తంగా చేపడుతున్న రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని సెక్రటరీలు, విఆర్ఓ లను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదేశించారు. కమిషనర్ సోమవారం తన ఛాంబర్‌లో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో రీ సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అలాగే అక్రమ కట్టడాలను గుర్తించి, వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో టిపిఓ రెహమాన్, సెక్రటరీలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రైతులపై పెనుభారం

ప్రజాశక్తి-తలుపుల

జగన్ ప్రభుత్వం రైతులపై పెనుభారం మోపుతోందని కదిరి డివిజన్ సిపిఐ కార్యదర్శి ఇషాక్ ధ్వజమె త్తారు. తలుపులలో సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటకూ న్యాయపరంగా ఇన్సూరెన్స్ ఇవ్వాలని, లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఇప్పటికీ అమ్మఒడి సొమ్ము ఖాతాల్లో జమకాక తల్లిదండ్రులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని, వెంటనే నదగు వేయాలని డిమాండ్ చేశారు. పెట్టు బడి సాగు సాయం ఎకరాకు రూ. 10 వేలు ఇవ్వాలన్నారు. హౌసింగ్ లబ్ధిదారులకు ఒక సెంటు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 1,80,000 ఇవ్వడంపై తీవ్ర విమర్శలు చేశారు. వర్షం కురిస్తే స్థానిక జగనన్న కాలనీ


విలేకరులతో మాట్లాడుతున్న డివిజన్ సిపిఐ కార్యదర్శి ఇషాక్

జలయం అవుతుందని మండిపడ్డారు. హంద్రీనీవా కాలువ పనులను వేగవంతంగా పూర్తిచేసి మండల రైతాంగానికి సాగునీరందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, స్థానిక నాయకులు జిల్లా కౌన్సిలర్ సభ్యుడు హసన్, మండల సహాయ కార్యదర్శి సిద్దయ్య, ఖాదర్, హుస్సేన్, మధు, రాజేష్, శంకర్, రమేష్, రమణ, హుస్సేన్‌బాషా, వెంగముని, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపితోనే మహిళల భవిష్యత్తుకు భరోసా

ప్రజాశక్తి-హిందూపురం

టిడిపితోనే మహిళల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, పార్లమెంటు ఉపాధ్యక్షులు శ్రీదేవి పేర్కొన్నారు. మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ముదిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లిలో మహాశక్తి మేనిఫెస్టో పై ప్రచారం నిర్వహిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి చెన్నమ్మ, పట్టణ అధ్యక్షురాలు విజయలక్ష్మి, అంగన్వాడీ రాష్ట్ర కార్యదర్శి వెంకటలక్ష్మి, గీతమ్మ, గంగమ్మ, కౌన్సిలర్ భారతి, దుర్గా, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీకి 'సర్వర్' సమస్య

ప్రజాశక్తి-మడకశిర


గంటల తరబడి వేచి ఉన్న కార్డు లబ్ధిదారులు

సర్వర్ సమస్యతో నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల్లో రేషన్ బియ్యం తీసుకోవడానికి లబ్ధిదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. వివరాలు.. మండల పరిధిలోని చందకచర్ల పంచాయతీ భీమరాయణ పల్లిలో సర్వర్ పనిచేయకపోవడంతో రేషన్ బియ్యం పంపిణీకి తీవ్ర అంతరాయం కలిగింది. జులై మాసానికి సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఎండియు వాహనదారులు ఒకటో తేదీ నుంచి కాలనీలకు వెళ్లి పంపిణీ చేయడానికి ప్రయత్నిస్తుండగా సర్వర్ సమస్యతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారం నుంచి భీమరాయణ పల్లిలో సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో గంటకు 3 నుంచి 4 కార్డులకు మించి సరఫరా చేయలేకపోతు న్నామని, రోజంతా కలిపినా 20 కార్డులకు కూడా సరఫరా చేయడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. కావున ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని సర్వర్ సమస్య రాకుండా పరిష్కరించాలని, లేనిచో తమ కార్డులను బుక్కులో నమోదు చేసుకొని పాత పద్ధతిలో సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని రేషన్ కార్డుదారులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


పర్యావరణంపై వివరిస్తున్న శంకరనారాయణ

పర్యావరణ పరిరక్షణ ప్రతి విద్యార్థి బాధ్యత అని గ్రీన్ భారత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రెడ్డి వారి శంకర నారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని యనమలపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ భూమిపై ఉన్న జీవరాసులు, అడవులు, కొండలు, వాగులు, నదులు రక్షించబడాలంటే గ్రీన్ రెవల్యూషన్ ఆఫ్ స్టూడెంట్స్ అనే నినాదంతో ముందుకెళ్లాలని సూచించారు. మట్టి, గాలి, నీటిని రక్షించకపోతే వచ్చే 20 ఏళ్లలో రేడియేషన్ పెరిగిపోయి ఉష్ణోగ్రతలు ఏర్పడి భూమి మీద నివసించడానికి స్థలం దొరకదని తెలిపారు. మనిషికి చదువు, చెట్టు రెండు కళ్లు లాంటివన్నారు. చితికిపోయిన రైతన్నను బతికించడమే మా గ్రీన్ భారత్ లక్ష్యం అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా విషం లేని ఆహారాన్ని ప్రజలకు అందించడమే మా ఉద్దేశం అని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పిపి యూనిట్ వైద్యాధికారిగా జగదీష్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పిపి యూనిట్ వైద్యాధికారిగా డాక్టర్ జగదీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని మర్యా దపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో వైద్యుడుగా విధులు నిర్వహించిన డాక్టర్ జగదీష్ ప్రస్తుతం పిపి యూనిట్ వైద్యాధికారిగా మరోసారి ధర్మవరం ఆసుపత్రికి రావడంతో సిబ్బంది అభినందనలు తెలిపారు.


ఎమ్మెల్యే కేతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ జగదీష్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారథి, నాయకులు

ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయిలో వివరించాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

సిఎం జగన్ పాలన లో అన్ని వర్గాలు పూర్తిగా దెబ్బతి న్నాయని, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయి లో ప్రజలకు వివరించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి బికె పార్థసారథి సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించగా పార్థసారథి హాజరై మాట్లాడారు. గ్రామస్థాయిలో అత్యంత కీలకమైన ఓటర్ వెరిఫికేషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. దొంగ ఓట్లు చేర్చి ఎన్నికల్లో గెలవాలని వైసిపి నాయకు లు చూస్తున్నారని, కావున అందరూ ఫీల్డ్ వర్క్‌తో పాటు టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గోరంట్ల, సోమందేపల్లి మండలాల కన్వీనర్లు సోమశేఖర్, సిద్దలింగప్ప, ట్రైనర్లు నరేష్ యాదవ్, నవీన్‌కుమార్, హరిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'ఓటరు' ప్రక్రియలో వాలంటీర్ల జోక్యం వద్దు

ఆర్డీవో తిప్పేనాయక్‌కు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఓటరు ప్రక్రియ, ఎన్నికల విధుల్లో వాలంటీర్లు పాల్గొనకుండా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం టిడిపి ఆధ్వర్యంలో ఎలక్ట్రోల్ రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీఓ తిప్పేనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి నెల పాటు జరగనున్న ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలో నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడా వాలంటీర్లు బూత్ స్థాయి అధికారులతో కలిసి పాల్గొనకుండా చూడాలని కోరారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వాలంటీర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు టిడిపి పూర్తిస్థాయిలో ఎన్నికల అధికారులకు సహకరిస్తుందని తెలిపారు. ఆర్డీఓను కలిసిన వారిలో కమతం కాటమయ్య, పురుషోత్తంగౌడ్, కాచర్ల కంచన్న, ఫణికుమార్, చింతపులుసు పెద్దన్న, పరిశే సుధాకర్, తలారి చంద్రమోహన్‌బాబు, కొత్తపేట ఆది, నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, బొట్టు కిష్ట, గంగారపు రవి, కేశగాళ్ల శీన, కరెంటు ఆది, దుర్గ, రమణ, తొగట అనిల్, బొగ్గు నాగరాజు, ఉస్మాన్, సురేశ్, రామకృష్ణ, నాగేంద్ర పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో యశోద విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం టౌన్ : రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో యశోద పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటినట్లు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ సోమవారం తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆదివారం జరిగిన త్రోబాల్ సబ్ జూనియర్స్ పోటీల్లో హేమశ్రీ(9వ తరగతి), మిథిల(8వతరగతి), కార్తీకనాయక్ ప్రతిభ కనబరచి రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిత్యం వహిస్తున్నట్లు తెలిపారు. వీరు ఆగస్టు 4, 5, 6 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపల్ అనూప్, వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్, మణికంఠ, జ్యోతి, ప్రసన్న అభినందించారు.

శ్రీనిధి రుణాల స్వాహాపై ఫిర్యాదు

కొత్తచెరువు : మండల పరిధిలోని కేసాపురం గ్రామంలో 44 సంఘాల శ్రీనిధి డబ్బులను ఐకెపి సిబ్బంది స్వాహా చేశా రని వారిపై చర్యలు తీసుకోవాలని స్నేహలత గ్రామైఖ్య సంఘం మహిళా సభ్యులు ఎస్ఐ లింగన్నకు ఫిర్యాదు చేశారు. తాము ఐకెపిలో రుణాలు తీసుకుని గతంలో కూడా సక్రమంగా చెల్లించామని, ఎలాంటి బకాయిలు లేవ న్నారు. శ్రీనిధి డబ్బులు కూడా తీసుకొని వాటిని సక్రమంగా చెల్లించామని అయితే అందులో పని చేసే సిబ్బంది ఆ డబ్బును చెల్లించలేదన్నారు. దాంతో ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మాకు ఇవ్వలేదన్నారు. రూ. 10 లక్షల కు పైగానే శ్రీనిధి నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక షిరిడిసాయినగర్‌లో నివాసం ఉంటున్న డెకరేషన్ రామాంజనేయులు(35) సోమవారం తన నివాసంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రామాంజనేయులు మొదటి భార్య మనీషారాణికి విడాకులు ఇచ్చి కూతురు శ్రావ్య(8)ను తన దగ్గరే ఉంచుకుని చదివిస్తున్నా డు. రెండు నెలల క్రితం విజయమ్మ అనే మరో మహిళను వివాహం చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మానసిక క్షోభకు గురై రామంజనేయులు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-బత్తలపల్లి

అక్రమంగా తరలిస్తున్న 25 ప్యాకెట్ల ప్రజా పంపిణీ బియ్యాన్ని సోమవారం జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. సిఎస్‌డిటి శారద తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని సంగాల గ్రామం నుంచి రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం అందింద న్నారు. దీంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సాయిప్రసాద్, సిబ్బందితో కలిసి సిఎస్‌డిటి ఆ గ్రామం వెళ్లి లోడు చేసుకుని సిద్ధంగా ఉన్న ఆటోను తనిఖీలు చేయగా బియ్యం ప్యాకెట్లు బయటపడ్డాయన్నారు. దీంతో 13.68 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. సంగాల గ్రామానికి చెందిన శివకుమార్ ప్రజల నుంచి రేషన్ బియ్యం సేకరించి కర్నాటకలోని బళ్లారికి తరలించి అధిక ధరకు విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందుతునిపై క్రిమినల్ కేసు నమోదు చేయించినట్లు తెలిపారు.

మడకశిర రూరల్ : అందిన సమాచారం మేరకు మడకశిర పట్టణంలో సోమవారం తనిఖీలు నిర్వహించి రేషన్ బియ్యంతో పాటు తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఇషాక్‌బాషా, సిఎస్‌డిటి హారతి తెలిపారు. కర్నాటకలోని పావగడ నుంచి తుమకూరుకు ఈచర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 360 బియ్యం ప్యాకెట్ల(175 క్వింటాళ్లు)తో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో విఆర్వో శంకరప్ప పాల్గొన్నారు.

బట్రేపల్లి చౌడేశ్వరి ఆలయానికి 'బత్తల' విరాళం

ప్రజాశక్తి-తలుపుల

మండల పరిధిలోని బట్రేపల్లి గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ దేవి జయంత్యుత్సవంలో సోమవారం వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా ఆయనకు స్థానికులు గ్రామ శివారు నుంచి డప్పు వాయిద్యాల మధ్య బాణసంచా పేల్చి ఘనంగా స్వాగతం పలికారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ చౌడేశ్వరి దేవస్థానం అభివృద్ధికి రూ. 2 లక్షలు ప్రకటించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్‌రెడ్డి, కదిరి టౌన్ ప్రెసిడెంట్ బాహుద్దీన్, నాయకులు సంపంగి గోవర్ధన్, రాము, రత్నమయ్య, చంద్ర, కృష్ణ, హరి, చిన్న చౌడప్ప, బట్రేపల్లి యూత్ సురేష్, రామ్మోహన్, నరేష్, రమేష్, రాఘవేంద్ర, వీరనారాయణ, రత్నాకర్, నాగేష్, సూర్యనారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

కంప్యూటర్, ప్రొజెక్టర్, బ్యాటరీలు అప్పగింత

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చోరీకి గురైన కంప్యూటర్, ప్రొజెక్టర్, బ్యాటరీలను రికవరీ చేయగా సోమవారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిఐ సుబ్రహ్మణ్యం లోనికోట ఉర్దూ పాఠశాల హెచ్ఎం వహీదకు అప్పగించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పట్టణానికి చెందిన నల్లపోతుల ముత్యాలు, మాహిస్‌ఖాన్, జావేద్ గత నెల 29వ తేదీ రాత్రి లోనికోట ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో కంప్యూటర్, బ్యాటరీలు ఎత్తుకెళ్లారన్నారు. హెచ్ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టి ఈ నెల 6వ తేదీన దొంగలను అరెస్టు చేసి వారి నుంచి 6 బ్యాటరీలు, కంప్యూటర్, ప్రొజెక్టర్, స్పీకర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వాటిని కోర్టు ఉత్తర్వుల మేరకు పాఠశాల హెచ్ఎంకు అప్పగించామని సిఐ తెలిపారు.


హెచ్ఎంకు అప్పగిస్తున్న సిఐ సుబ్రహ్మణ్యం

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సెంట్రల్ టీం

ప్రజాశక్తి-బత్తలపల్లి

భవిష్యత్తులో పోలీస్ స్టేషన్లను మరింత అధునాతనంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని సెంట్రల్ టీం సభ్యులు కలియ అరసన్ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో మౌలిక వసతులు, పరిసరాలు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించేందుకు సోమవారం సెంట్రల్ టీం బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించింది. సెంట్రల్‌టీంకు స్టేషన్‌లో ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు స్టేషన్ రికార్డుల ను పరిశీలించి, వాటి భద్రతపై ఆరా తీశారు. అలాగే స్టేషన్‌లో వివిధ విభాగాలు, వాటి పనితీరు, స్టేషన్ చుట్టూ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ప్రజలు, పోలీసులకు కల్పిస్తు న్న మౌలిక వసతులను పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులను, స్టేషన్‌కు వచ్చిన వారిని ఆప్యా యంగా పలకరించి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తాము దేశమంతా పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే చిత్తూరు, అనంతపురం ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తు న్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ టీవీ శ్రీహర్ష, పోలీసులు పాల్గొన్నారు.




బత్తలపల్లి పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు

'స్పందన' ఫిర్యాదులకు సత్వర పరిష్కారం : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

స్పందన ఫిర్యాదులకు సంబంధిత పోలీస్ స్టేషన్లలో సత్వర పరిష్కార మార్గాలు చూపాలని, అవి పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. స్పందనకు సోమవారం జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి నిర్దేశిత గడువులోగా పిటీషన్లకు పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు. ధర్మవరం పట్టణానికి చెందిన షోవే కన్సల్టేషన్‌కు చెందిన హేమంత్ ఉద్యోగాల పేరుతో పలువురి నుంచి రూ. లక్షలు దండుకుని మోసం చేశారని అతనిపై చర్యలు తీసుకుని డబ్బు వాపసు ఇప్పించాలని బాధితులు కోరారు. అలాగే భర్త, అత్తారింటి వేధింపులు, భూ వ్యవహారాలు, సైబర్ నేరాలు, తదితర సమస్యలతో కార్యాలయానికి రాగా ఎస్పీ అక్కడికక్కడే పరిష్కారం చూపారు. కార్యక్రమంలో ఎఎస్పీ ఎన్.విష్ణు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మహిళ

శాస్త్రవేత్త సంపత్‌కుమార్‌కు సన్మానం

కదిరిటౌన్ : పట్టణంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ కుమార్ నేషనల్ అవార్డు పొందిన సందర్భంగా సోమవారం కదిరి ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పని చేస్తున్న కార్మికులు పూల మాల, శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో సిఐటియు నాయకులు జగన్మోహన్, ముస్తాక్‌అలీ, రామ్మోహన్, వర్కర్స్ యూనియన్ నాయకులు గంగప్ప, పద్మావతి, లక్ష్మీబాయి, మంజుల, ఫాతిమా, గంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలకు గ్యారెంటీ నిబంధనను తొలగించాలి

రాయదుర్గం : పంట రుణాల మంజూరు విషయంలో పూచీకత్తు నిబంధనను తొలగించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు ఎస్‌వి ఆంజనేయులు కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారెంటర్ నిబంధన ఉంచడం వల్ల రైతులందరికీ రుణాలు పొందేందుకు వీలుపడదన్నారు. పూచీకత్తు స్థానంలో బ్యాంకు ఖాతాదారుని సంతకం తీసుకుంటే సరిపోతుందన్నారు. అంతేకాక బ్యాంకు కార్యాలయానికి వెళ్లే దారి ఇరుకుగా ఉండటం వల్ల వృద్ధులు, వికలాంగులు మొదటి అంతస్తులో ఉన్న బ్యాంకు కార్యాలయానికి చేరేందుకు కష్టం అవుతోందన్నారు. రైతులు, వృద్ధులు, వికలాంగుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రుణాల విషయంలో నిబంధనలు సరళం చేయాలని, బ్యాంకును విశాలమైన ప్రాంగణంలో మార్చేలా చూడాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నాగరాజు, సంతోష్, జనార్ధన, తిప్పేస్వామి తదితరులు ఉన్నారు.

రైతు దగా ప్రభుత్వం

గుంతకల్లు : రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టి మోసం చేస్తున్న రైతు దగా ప్రభుత్వం వైసిపి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ విమర్శించారు. సోమవారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో రైతుసంఘం నియోజవర్గ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 16 రకాల నిర్ణయాలు అమలు చేస్తున్నానని కళ్యాణదుర్గం సభలో సిఎం జగన్ అబద్ధాలు చెప్పడం బాధాకరమన్నారు. ముఖ్యంగా రైతుభరోసా, బీమా ప్రతి ఏడాది ఇస్తున్నానని గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే ఆర్‌బికెల్లో ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు ఇస్తున్నామని చెప్పడం హాస్యాస్పంగా ఉందన్నారు. ఒకవేళ ఎక్కడైనా ఇచ్చినా నాణ్యతలేని వేరుశనగ విత్తనాలు ఇస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభాకర్, టిడిపి నాయకులు మల్లికార్జున, రైతుసంఘం నాయకులు మందాలప్ప, సిపిఐ నియోజవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి బి.మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రామురాయల్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పిసి కుల్లాయప్ప, రైతుసంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

అమర్నాథ్‌గౌడ్ హత్య బాధాకరం

అనంతపురం : రేపల్లెలో నెల క్రితం పదవ తరగతి విద్యార్థి అమర్నాథ్‌గౌడ్‌ను హత్య చేయడం బాధాకరమని టిడిపి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని టిడిపి కార్యాలయంలో అమర్నాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి పాలనలో దాడులు, హత్యలు, అరాచకాలు మితిమీరిపోయాయన్నారు. అమర్నాథ్‌గౌడ్‌ను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, బీసీ సెల్ నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న, రాష్ట్ర కార్యదర్శి శివబాల, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, శాలివాహన సాధికారిక రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, వడ్డెర సాధికారిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, ఈడిగ సాధికారిక రాష్ట్ర డైరెక్టర్లు గోపాల్‌గౌడ్, వాల్మీకి సాధికారిక రాష్ట్ర డైరెక్టర్ మణిరవి, కురుబ సాధికారిక రాష్ట్ర డైరెక్టర్ నారాయణస్వామి, వాల్మీకి సాధికారిక జిల్లా అధ్యక్షులు ప్రతాప్‌నాయుడు, వడ్డెర సాధికారత జిల్లా అధ్యక్షులు వన్నూరు, టిడిపి బీసీ సెల్ జిల్లా నాయకులు గంగవరం బుజ్జి, కొయ్యగూరు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగనపల్లిలో 'జగనన్న సురక్ష'

నార్పల : మండలంలోని గంగనపల్లి సచివాలయం పరిధిలో నేటి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ తెలిపారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది జయలక్ష్మి, దివ్యభారతి, సురేఖ, వాలంటీర్లు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై సిపిఎం ఫిర్యాదు



తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

కనగానపల్లి : మండలంలో భూ ఆక్రమణలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం సిపిఎం మండల కార్యదర్శి బత్తల కదిరప్ప ఆధ్వర్యంలో రైతులు తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కదిరప్ప మాట్లాడుతూ మండల పరిధిలోని దాదులూరు పంచాయతీ పరిధిలో ఉన్న కొండ ప్రాంతం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే చిన్న, సన్నకారు రైతులు, నిరుపేదల భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. దాదులూరు రెవెన్యూ గ్రామంలో వంక పరంబోకు భూమిని స్వాధీనం చేసుకుని లే అవుట్ వేశారని, తద్వారా హంద్రీనీవా పిల్లకాలువ పక్క గ్రామాలకు వెళ్లకుండా చేయడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అంతేగాకుండా అటవీ ప్రాంతం, వన సంపద అన్యాకాంతం కాకుండా వెంటనే చర్యలు చేపట్టాలని, లేనిచో భవిష్యత్తులో రైతులు, ప్రజలతో కలిసి సిపిఎం పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు.

జెవివిలో భాగస్వాములు కండి

ఓబులదేవరచెరువు : శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం ప్రజలందరూ సైన్స్ ఫలాలు పొందాలని వక్తలు సూచించారు. జన విజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జెవివి జిల్లా కార్యదర్శి గౌస్ లాజం పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జెవివి మండల శాఖ ఆధ్వర్యంలో కొండకమర్ల గ్రామంలో గోడపత్రిక పోస్టర్లను విడుదల చేశారు. అనంత రం వారు మాట్లాడుతూ శాస్త్రీయ విధానం ద్వారా రేపటి తరాన్ని చైతన్యం చేయడానికి చెకుముకి పరీక్షలు, ఆరో గ్యం, మూఢ్యవ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెవివి 35 ఏళ్లుగా తెలుగు ప్రజల తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తుందన్నారు. ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ చైతన్యవంతం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం మునేనాయక్, షబీన, జెవివి సభ్యులు సోమశేఖర్, అతావుల్లా, మాధవి. భార్గవరెడ్డి, నేలకోటప్ప, ద్వారకనాథ్‌రెడ్డి, రోషన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

బత్తలపల్లి : ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ సౌజన్యకుమారి సూచించారు. మండల పరిధిలోని దంపెట్ల గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ కూలీలు వంద రోజుల పని దినాలను పూర్తి చేసుకోవాలన్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తేనే కచ్చితమైన కూలీ దక్కుతుందన్నారు. పని ప్రాంతాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి గజ్జల వెంగళరెడ్డి, సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, పద్మావతి, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీధర్‌రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి

బత్తలపల్లి : వాలంటీర్ల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని దంపెట్ల గ్రామ సచివాలయ ఆవరణలో దంపెట్ల, గరికలపల్లి గ్రామ పంచాయతీల సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, పద్మావతి అధ్యక్షతన 'జగనన్న సురక్ష' గ్రామసభ నిర్వహించగా ముఖ్యఅతిథులుగా ఎంపిపి బగ్గిరి త్రివేణి, వైస్ ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, ఎంపిడిఓ సౌజన్యకుమారి, సిఎస్‌డిటి శారద హాజరయ్యారు. అనంతరం 1,111 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివాకర్, మండల కన్వీనర్ కుగ్గిరి బయపరెడ్డి, సచివాలయ కన్వీనర్ జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

రొద్దం : మండల పరిధిలోని గౌరాజుపల్లి, రొద్దంలో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలను సోమవారం ఎఒ నివేదిత, ఎఇఒ అంజాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన పద్ధతులను వివరించారు. వారి వెంట విహెచ్‌ఎలు గోవర్ధన్, నాగభూషణ్, గోవిందప్ప, రైతులు మాధవయ్య, లోకేష్, తదితరులు ఉన్నారు.

విజన్ బిల్డింగ్‌పై శిక్షణ

ముదిగుబ్బ : స్థానిక క్రాంతి మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఎపిఎం హేమలత ఆధ్వర్యంలో ఆదర్శ మండల సమాఖ్య లక్షణాలు-మార్పులు అంశాలపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సిబ్బంది పాత్ర ఎలా ఉండాలో ఆట పాటలు ఛార్టు ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సమాఖ్య లీడర్లు పద్మావతి, లక్ష్మీనారాయణమ్మ, ఈసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

దళితుల భూసమస్యలపై ఫిర్యాదు

రొళ్ల : మండల పరిధిలోని టిడి.పల్లి గ్రామపొలిమేరలో ఉన్న దళితుల భూ సమస్యలపై సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు టైగర్ వన్నూర్‌స్వామి, కళ్యాణదుర్గం తాలూకా అధ్యక్షులు లక్ష్మణ మూర్తి నేతృత్వంలో మడకశిర తాలూకా అధ్యక్షులు యాల్లోటి రామాంజి, రొళ్ల మండల అధ్యక్షులు నరసింహమూర్తి రొళ్ల డిప్యూటీ తహశీల్దార్ భాగ్యలక్ష్మిని కలిసి వివరించారు. స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మడకశిర మండల అధ్యక్షులు చందు, దాసు, దుర్గేష్, రాజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం బస్సు ఏర్పాటు

రొద్దం : మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలలు, కళాశాలలకు రొద్దంకు రావాల్సి ఉంది. అయితే కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో కొందరు విద్యార్థులు హిందూపురం, మడకశిర, తదితర పట్టణాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో చేరారు. దీంతో స్థానిక కళాశాలలో విద్యార్థుల చేరిక బాగా తగ్గిపోయింది. దీంతో ప్రిన్సిపల్ విజయలక్ష్మిబాయూ మడకశిర ఆర్టీసీ డిపో అధికారులు, ఎమ్మెల్యే శంకరనా రాయణకు ఈ విషయాన్ని వివరించి రొద్దం మీదుగా పెనుకొండకు బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సూచన మేరకు డిపో మేనేజర్‌కు బస్సు సర్వీసును ఏర్పాటుచేయగా సోమవారం ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి ప్రారంభించారు. దీంతో ప్రిన్సిపల్ విజయలక్ష్మిబాయి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెట్టి మారుతిరెడ్డి, రాజగోపాలరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, సర్పంచి వనజ, ఎంపిటి సిలు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

18న ఆశా వర్కర్ల ధర్నా

పెనుకొండ : ఆశా వర్కర్ల సమస్యలపై ఈ నెల 18వ తేదీ డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నామని తెలుపుతూ సోమవారం పెనుకొండ సబ్ సెంటర్‌లో వైద్యాధికారి సౌమ్యకి సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్స్‌కు పని భారం తగ్గించాలని, సంబంధంలేని పనులు చేయించరాదని, అధికారుల వేధింపులు ఆపాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు వెంటనే అమలు చేయాలని, తదితర డిమాండ్లతో ధర్నా చేస్తున్నామన్నట్లు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు అలివేలమ్మ, తులసి, రాజేశ్వరి, గంగ, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెండర్లు పిలిచి ఖాళీ స్థలంలో షెడ్లు వేయాలి

పెనుకొండ : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని 180 సర్వే నంబర్‌లో(ఇందిరమ్మ కాలనీలో) 20 ఏళ్ల క్రితం లేవుట్ వేశారు. ఈ లేవుట్ కు పడమర దిశలో 30 లింకుల రోడ్డు తర్వాత ఉన్న ఖాళీ స్థలంలో షెడ్లు వేసేందుకు వైసిపి నాయకులు ఏర్పాట్లు చేశారని అలా ఏకపక్షంగా వ్యవహరించకుండా ఓపెన్ టెండర్ వేసి నగర పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ వంశీకృష్ణభార్గవను కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ గిరి, టౌన్ కన్వీనర్ రవిశంకర్, నాయకులు హుజూర్, రామలింగ నాయుడు, ఖాదిర్, రియాజ్, జావీద్, అనిల్, తదితరులు ఉన్నారు.

మైసూర్ ఎక్స్‌ప్రెస్‌లో వృద్ధుడు మృతి

ధర్మవరం టౌన్ : మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం రాత్రి ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఆగిన సమయంలో జనరల్ బోగీలో ఓ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు గుర్తించామని రైల్వే జీఆర్పీ ఎస్ఐ గోపికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ధర్మవరం స్టేషన్‌కు రాగానే జనరల్ బోగీలో ఓ వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు ప్రయాణికులు సమాచారం ఇవ్వడంతో పరిశీలించామన్నారు. అతడు అనారోగ్యం, ఇతర కారణాల వల్ల చనిపోయి ఉండవచ్చని రైల్వే పోలీసులు భావించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27640, 94405 52808 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్ఐ తెలిపారు.

కండక్టర్ మృతి

కదిరి టౌన్ : కదిరి డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న ఎం.మధుసూదనరావు(58) అనంతపురం నగరంలోని సవేరా హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. దహనక్రియల ఖర్చుకు గానూ డిపో మేనేజర్ కుటుంబ సభ్యులకు రూ. 15వేలు అందజేశారు. ఆయన స్వస్థలం వైఎస్ఆర్ కడప జిల్లాలోని పులివెందుల. కదిరి డిపోలో 1992లో కండక్టర్‌గా విధుల్లో చేరారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నేళ్లుగా పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో నివాసం ఉంటున్నారు. అనేకసార్లు ఉత్తమ ఆదాయ కండక్టర్‌గా ఎంపికయ్యాడు. మధుసూదనరావు మృతి పట్ల కదిరి డిపో మేనేజర్ బి.మైనుద్దీన్, అసిస్టెంట్ మేనేజర్లు హరిమోహన్, హరిత, ట్రాఫిక్ సూపర్‌వైజర్ నాగసుబ్బయ్య, అసోసియేషన్ నాయకులు బైరిశెట్టి, శంకరప్ప, రామచంద్ర, ఎన్‌వి రమణ, నారాయణస్వామి, సురేంద్ర, రవీంద్ర తదితరులు సంతాపం తెలిపారు.

గ్రామ సంఘాలకు శిక్షణ

ఓబులదేవరచెరువు : గ్రామ సంఘాలకు మూడు రోజుల శిక్షణలో భాగంగా మొదటి రోజు మండల సమైక్యలో నిర్వహించిన శిక్షణకు మండల పరిధిలోని 40 గ్రామ సంఘాల నుంచి సమైక్య సభ్యులు హాజరయ్యారని ఎబిఎస్ రమణప్ప తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు వెంకటరమణ, వేణుగోపాల్, చంద్రారెడ్డి, శ్రీనివాసులు హేమభూషణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, కార్యదర్శి లక్ష్మీనరసింహ, నాగలక్ష్మి, లక్ష్మీ, గ్రామ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగదు

గాండ్లపెంట : వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక గ్రామ సచివాల యం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడలిలో మానవ హారంగా ఏర్పడ్డారు. అనంతరం జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పైన కేసు నమోదు చేయాలని ఎస్సై మల్లి కార్జునరెడ్డికి ఫిర్యాదు చేశారు. అలాగే తహశీల్దార్ హమీద్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జెసిఎస్ రవీంద్రరెడ్డి, వాలంటీర్లు కవిత, ఆజాద్, కొండయ్య, అంజి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

ఇళ్ల స్థలాలు చూపాలని గ్రీవెన్స్‌లో వినతి

కొత్తచెరువు : కొత్త చెరువుకు చెందిన 11 మందికి గతేడాది డిసెంబర్‌లో సర్వే నెంబర్-392లో ఇంటి పట్టాలు మం జూరు చేశారు కానీ ఇప్పటివరకు స్థలాలు చూపించలేదని మానవ హక్కుల సంఘం నాయకులు పాపన్న, బెల్లం నజీర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో లబ్ధిదారుల తో కలిసి తహశీల్దార్ రామాంజనేయరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 145 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారని, వారిలో 11 మందికి ఇంతవరకూ స్థలాలు చూపించలేదన్నారు. జగనన్న కాలనీలో ప్లాట్లు ఖాళీగా ఉన్నాయని వాటిని వీరికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకులు నాగరాజు, సాయిప్రసాద్, లబ్ధిదారులు ఆంజనేయులు పాల్గొన్నారు.